క్లుప్తంగా

బాధితులకు దాతల చేయూత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన పుల్ల మాణెమ్మ నివాసపు గుడిసె మూడు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. బాధితురాలికి సోమవారం పలువురు దాతలు చేయూతనిచ్చారు. నాగిరెడ్డిపేటకు చెందిన కాంగ్రెస్ నేత నర్సింహారెడ్డి బాధితులకు 25 కిలోల బియ్యం, బట్టలు అందజేశారు. దీంతోపాటు నాగిరెడ్డిపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కిరాణ సామగ్రి, కూరగాయలు అందజేశారు. కాగా ఎల్లారెడ్డిలోని జీవదాన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బాధితురాలికి వంటసామగ్రితోపాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. కొంత ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు వెంకట్, హన్మాండ్లు, ఫారూక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా రంజిత్‌కుమార్



దోమకొండ: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ వ్యక్తిత్వ వికాస్ శిక్షకుడిగా దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని రీజియన్–10లో జరిగిన రెండు రోజుల శిక్షణ తరగతుల్లో ఆయనను ఎంపిక చేశారు. ఉత్తమ ప్రతిభతో ఎంపికైనట్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్–10 ప్రెసిడెంట్ నక్క నవీన్‌కుమార్, నేషనల్ డైరెక్టర్ లాభిశెట్టి మహేష్‌లు ప్రకటించినట్లు రంజిత్‌కుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా విద్యాధికారి అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం నమోదు చేసుకోవాలి



ఎల్లారెడ్డి రూరల్: భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వ నమోదు చేసుకోవాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు సాయిబాబా అన్నారు. సోమవారం వెంకటాపూర్, వెల్లుట్ల గ్రామాలలో భవన నిర్మాణ కార్మికుల సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకోవడం వల్ల లేబర్ కార్డు పొందవచ్చని తెలిపారు.

బీసీలు ఐక్యంగా పోరాడాలి

దోమకొండ: బీసీలు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం మండల యూత్ అధ్యక్షుడు పుల్ల గంగాధర్ అన్నారు. సోమవారం అంబారిపేటలో బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలు ఐక్యంగా ఉద్యమాలు చేసి తమ హక్కులను కాపాడుకోవాలని కోరారు. బీబీపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ రంగోలు శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొలమద్ది రాజేందర్, నాయకులు రంగోలు ఈశ్వర్‌గౌడ్, సిరికొండ శంకర్, పిరంగి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మాచారెడ్డి: ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాల్‌రాజు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి సంబంధించిన కరపత్రాలను సోమవారం పాల్వంచ మండలం ఫరీదుపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం పాల్వంచ మండల అధ్యక్షుడు బట్ట రాజు, నాయకులు రాగుల రమేష్, బుచ్చిగాని రవీందర్, బుచ్చిగాని రాజు, గుంటి చంద్రశేఖర్ ఉన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు



కామారెడ్డి టౌన్ : ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విద్యార్థులకు కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఆయా మండలాల నుంచి ప్రత్యేక వాహనాలలో విద్యార్థులను తీసుకువస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ మారుతి, వైద్యులు లింబాద్రి తదితరులున్నారు.

టోల్ వసూలు చేస్తే ఊరుకోం

- సమీపంలోని గ్రామస్తుల నుంచి ఫీజు వసూలు చేయడం తగదు
- టోల్‌ప్లాజా వద్దకు తరలి వచ్చిన రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్ గ్రామస్తులు



భిక్కనూరు టోల్‌ప్లాజా ఇన్‌చార్జి ప్రకాశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్ గ్రామస్తులు

భిక్కనూరు : మా పంట పొలాల వద్దకు, మార్కెట్‌కు వెళ్లాలంటే జాతీయ రహదారి మీదుగానే వెళ్లాల్సి వస్తోంది.. ఎన్నడూ లేనిది ఇప్పుడు కొత్తగా లోకల్ ఫోర్‌వీల్ వాహనాలు, ఆటోలు, జీపులకు టోల్ ఫీజు తీసుకోవడం తగదంటూ రామేశ్వరపల్లి వీడీసీ ఆధ్వర్యంలో రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్ గ్రామస్తులు సోమవారం భిక్కనూరు టోల్‌ప్లాజా వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము వాహనాల్లో ప్రతి రోజు రెండు పర్యాయాలు తమ పంట పొలాల వద్దకు వెళ్తామని తెలిపారు. రోజూ టోల్ ఫీజు చెల్లించాలంటే వ్యవసాయం చేయడం మానుకోవడమే మార్గమంటూ టోల్ ప్లాజా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను లోకల్ వాహనాలకు టోల్ ఫీజు చెల్లించమని స్పష్టం చేశారు. మండలంలోని 18 గ్రామాలకు చెందిన వారికి గతంలో మాదిరిగానే టోల్ ప్లాజా వద్ద ఉచితంగా పంపించాలని ఎలాంటి పన్నులు తీసుకోవద్దని కోరుతూ టోల్ ప్లాజా ఇన్‌చార్జి ప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్‌రెడ్డి, విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, నేతలు కోక స్వామి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ, కరాటేలో పిట్లం విద్యార్థినుల ప్రతిభ



మెడల్స్ సాధించిన పిట్లం విద్యార్థినులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు కుంగ్‌ఫూ, కరాటే పోటీలలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. సంగారెడ్డిలో ఆదివారం జరిగిన రెండో ఓపెన్ నేషనల్ కుంగ్‌ఫూ, కరాటే ఛాంపియన్‌షిప్‌లో మహాలక్ష్మి, నిక్షిత, స్ఫూర్తి, అశ్వినిలు సత్తా చాటి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ శివప్రసాద్ తెలిపారు. అదే విధంగా రాధాకుమారి, నవ్య, నిఖిత, వరలక్ష్మి, నందిని, అనురాధ, వాగ్దేవి, కారుణ్య, శ్రీహర్ష సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థినులను ఎంఈవో దేవిసింగ్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

అడవి పందుల దాడి.. జొన్న ధ్వంసం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎర్రకుంట తండాలో సక్రు నాయక్‌కు చెందిన జొన్నపంటను ఆదివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. సక్రునాయక్ మూడెకరాల భూమిలో జొన్న సాగు చేస్తున్నారు. కాగా పంటలో కొంతభాగాన్ని అడవి పందులు ధ్వంసం చేశాయని, నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభు కిరణ్

భిక్కనూరు: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని దోమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. 30 ఏళ్లు దాటిన వారికి తప్పనిసరిగా బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించాలన్నారు. వైద్యులు యేమిమా దివ్య, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, స్టాఫ్ నర్సులు హరిత, చైతన్య పాల్గొన్నారు.

పరీక్షలు అంటే భయపడొద్దు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పరీక్షలు అంటే భయపడవద్దని, ఇష్టంగా చదవాలని మైపుట్ ప్రింట్స్ పుస్తక రచయిత డాక్టర్ అంబీర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయన సోమవారం దేమికలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన బోధనను అందిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రణాళికతో ముందుకు సాగాలని, సంకల్పం గట్టిదైతేనే విజయం సాధిస్తారన్నారు. విజయ లక్ష్యంతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, మారుతి, రాధ, భాస్కర్‌రెడ్డి, నారాయణ, సతీష్, అనీల్, మనోహర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే పేదరిక నిర్మూలన



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం రాజు

దోమకొండ: మహిళా సంఘాల సభ్యులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పేదరిక నిర్మూలన తగ్గుతుందని ఐకేపీ ఏపీఎం రాజు పేర్కొన్నారు. సోమవారం దోమకొండ మండల కార్యాలయంలో ఆహారం, పోషణ, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై వీవోఏలు, గ్రామ సంఘ సభ్యులు, ఆరోగ్య కమిటీ మెంబర్లకు శిక్షణ ఇచ్చి మాట్లాడారు. మహిళా సంఘాల కుటుంబాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పేదరికం నుంచి బయట పడడం సాధ్యమన్నారు. 1000 రోజుల ప్రణాళిక, పౌష్టికాహారం, రక్తహీనత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. వీటిని స్వయం సహాయక సంఘాల రెండో సమావేశంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించి ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేటట్లు చేయాలని వివరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎల్లారెడ్డి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా యువభారత్ ద్వారా స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించడానికి యువతకు ఈ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పరుగు పందెం పోటీలను నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. స్పోర్ట్ ఇన్‌చార్జి శివ కుమార్, కృష్ణ ప్రసాద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ముందస్తుగా అడ్మిషన్లు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. జిల్లాలో కొన్ని ప్రైవేట్ స్కూల్‌లో పరీక్షలు పూర్తి కాకుండానే కొత్త అడ్మిషన్‌లు ప్రారంభించారని, బహిరంగంగానే ప్రచారాలు చేస్తున్నారని వివరించారు. కనీస సౌకర్యాలు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాందాస్, సతీష్, రాకేష్, బాబు తదితరులున్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. పాఠశాల హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రసన్న, లక్ష్మి, అనిత, మోక్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి కోసం సర్వే



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో బోర్ బావి తవ్వకం కోసం అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు ప్రేమలత ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. బోర్ బావిని ఏ ప్రాంతంలో తవ్వితే నీరు వస్తుందన్న విషయమై సర్వే నిర్వహించి నివేదికను అందజేస్తామని ఆమె తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, వైద్యులు దివ్య, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, స్టాఫ్‌నర్సులు హరిత, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆలయాల వద్ద సోమవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీవో మలహరి పరిశీలించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. శివరాత్రి పండగ రోజు భక్తులకు అసౌకర్యం కలుగకుండా పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సాయిలు, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీ పనులు..

లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల, అయ్యపల్లి గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అలాగే నర్సరీ, కంపోస్టుషెడ్డు, శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఉపాధి పనులు కొలతల ప్రకారం నాణ్యతతో చేయాలని సూచించారు. కూలి డబ్బులు గిట్టుబాటుగా వచ్చేటట్లు పనులు చేపట్టాలన్నారు.



వెండి నాగాభరణం బహూకరణ



భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలోని స్వామి వారికి భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన వ్యాపారి గజవాడ శ్రీనివాస్, స్వప్న దంపతులు రూ.1.16 లక్షల విలువ చేసే వెండి నాగాభరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కొడకండ్ల రామగిరిశర్మ దాత దంపతులతో నాగాభరణానికి ప్రత్యేక పూజలు చేయించి స్వామివారికి అలంకరింపజేశారు. ఆలయ ఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి 3 లక్షల 14 వేల 341 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏటీఎం బాగు చేయించరూ..



రాజంపేటలో పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం

రాజంపేట: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం పది రోజులుగా వినియోగంలో లేక ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏటీఎం మిషన్ చెడిపోవడంతో పాటు లోపలి గది చెత్తాచెదారంతో నిండిపోయింది. ఏటీఎం నిర్వాహకులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



డోంగ్లీలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మద్నూర్/నస్రుల్లాబాద్/పిట్లం/నిజాంసాగర్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక అధికారులకు సూచించారు. సోమవారం డోంగ్లీ, నస్రుల్లాబాద్, పిట్లం, మహమ్మద్‌నగర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, నీటి సదుపాయం, మరుగుదొడ్లను పరిశీలించారు.

‘జంగంపల్లి పేదలకు న్యాయం చేయాలి’



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్ : భిక్కనూర్ మండలం జంగంపల్లిలో నివాసం ఉంటున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఇళ్ల స్థలాలు, పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విచారణ జరిపి తగిన న్యాయం చేస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకటరావు, సహాయ కార్యదర్శి పద్మ, జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యోగ విరమణ పొందిన వెంటనే బెనిఫిట్లు చెల్లించాలి’



మాట్లాడుతున్న ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్/కామారెడ్డిటౌన్: ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.హన్మంతురెడ్డి, పి.విజయ రామరాజు, రాష్ట్ర ప్రతినిధి జి.లచ్చయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన వారి స్థాయిని బట్టి రూ.40 నుంచి రూ.70 లక్షలు జీపీఎఫ్, జీఐఎస్, కమ్యూటేషన్, సరెండర్ సెలవులు ఏక మొత్తంలో చెల్లించాలన్నారు. జిల్లాలో 500 మంది విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్లున్నాయని పేర్కొన్నారు. ప్రతినిధులు సత్తయ్య, రవీందర్, సత్యనారాయణ, శంకరయ్య, రాజలింగం పాల్గొన్నారు.

‘108’ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

రాజంపేట: మండలానికి నూతనంగా వచ్చిన 108 అంబులెన్సుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానికులకు 108 సిబ్బంది సూచించారు. సోమవారం రాజంపేట రైతు వేదికలో జరిగిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కామారెడ్డి జిల్లా శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఐకేపీ మహిళా సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, ప్రమాదాల బారిన పడిన వారికి 108 అంబులెన్స్ వాహనం అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. సిబ్బంది ఈఎంటీ రాములు, పైలట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉచితంగా చికెన్, గుడ్ల పంపిణీ



ఉచిత గుడ్లు, చికెన్ కోసం క్యూలైన్‌లో నిలబడిన ప్రజలు

కామారెడ్డి క్రైం : చికెన్, కోడి గుడ్లు తింటే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని ప్రజలకు అవగాహన కల్పించేందుకు వెన్‌కాబ్ కంపెనీకి చెందిన వెంకటేశ్వర హేచరీస్ ప్రతినిధులు సోమవారం జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో చికెన్, గుడ్ల ఉచిత పంపిణీ మేళా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వస్తుందనే వదంతుల కారణంగా చికెన్ ఎవరూ తినడం లేదని అన్నారు. చికెన్‌ను 70 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద ఉడికించి తింటే ఎలాంటి వైరస్‌ల ప్రభావం ఉండదన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు ఫ్రై చేసిన చికెన్, ఉడికించిన కోడి గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. దుకాణాలకు వెళ్లి చికెన్ కొనుగోలు చేసేందుకు జంకుతున్న జనం మాత్రం ఉచితంగా చికెన్ ఫ్రై పంపిణీ చేస్తున్నారని తెలియడంతో ఒక్కసారిగా ఎగబడ్డారు.

ఆధ్యాత్మికం..

విశ్వనాథేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి అర్బన్: స్థానిక విద్యానగర్‌లోని మహాగణపతి, విశాలాక్షీసమేత విశ్వనాథేశ్వర స్వామివారి ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం పూజలతో పాటు మధ్యాహ్నం బలిప్రదానం, స్వామి వారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నప్రసాదం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌గౌడ్, మోహన్‌లు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్, మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు ఉంటాయి. బుధవారం ఉదయం గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కళ్యాణం శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయి. రాత్రికి శివపార్వతులు, సీతారాములవిగ్రహాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథాలను ఊరేగింపుగా బస్టాండ్ వద్దకు తీసుకెళ్లి మహారాష్ట్ర ప్రాంతం నుంచి ప్రత్యేకంగా తయారుచేయించిన బాణసంచాను కాల్చుతారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ అధ్యక్షుడు కొండ అంజం తెలిపారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు



మద్నూర్(జుక్కల్): కోడిచిరలోని శివస్వాముల సన్నిధానంలో సోమవారం శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు వైభవంగా పడిపూజ నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్షలో ఉన్న స్వాములు మహా శివరాత్రికి శ్రీశైలంలో ఉంటామని వారు అన్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నేటి నుంచి తిప్పాపూర్ ఆలయ ఉత్సవాలు

భిక్కనూరు: తిప్పాపూర్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు మల్లిఖార్జునస్వామి ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావల్సిందిగా వారు కోరారు.